క్లుప్తంగా

మద్దిలేటి స్వామికి శ్రావణ మాస పూజలు


ఆలయ ఆవరణంలో భక్తుల సందడి

బేతంచెర్ల : మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు.

చల్లాకు ఘన నివాళి


చల్లా రామకృష్ణా రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి

అవుకు(కొలిమిగుండ్ల): దివంగత నేత మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి జయంతిని కుటుంబ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న చల్లా ఫాం హౌస్‌లో చల్లా విగ్రహానికి ఆయన సతీమణి శ్రీదేవి, కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. ప్రతి ఏటా కృష్ణాష్టమి రోజున జయంతి వేడుకలను జరుపుకునే వారని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వరరెడ్డి గుర్తు చేశారు. తన తండ్రి మాట, ఉనికి ఎప్పటికీ తమ గుండెల్లో పదిలంగా ఉంటాయన్నారు. రాజకీయాల్లో ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని, ఆయన చేసిన సేవలు ఎప్పటికి గుర్తుండిపోతాయని అన్నారు.

కనకాద్రిపల్లె డీలర్ మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె డీలర్ సూరపురెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పేరం సత్యనారాయరెడ్డి, రామసుబ్బయ్య, నందిపాడు సర్పంచ్ గుర్విరెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులుతో పాటు పలువురు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే కుటుంబంలో మనవడు, తాత మృతి చెందడం బాధాకరమని జెడ్పీచైర్మన్ విచారం వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఘనంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి


బహుమతులు అందుకున్న విజేతలతో ఎమ్మెల్యే కోట్ల తదితరులు

డోన్ టౌన్ : మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి 105వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోట్ల అభిమానులు, టీడీపీ నాయకులు జెడ్పీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తారకరామనగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో శనివారం రాత్రి ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి వివరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ తదితర వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


గుళ్లదూర్తిలోని కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


కోవెలకుంట్లలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం


డోన్‌లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


డోన్ సరస్వతి శిశుమందిర్‌లో వివిధ వేషధారణలలో చిన్నారులు


ఆకుమల్ల గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణం వందే జగద్గురుమ్

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు
- యాదవ సంఘీయుల ర్యాలీలు
- ఆకట్టుకున్న కృష్ణ, గోపికల వేషధారణ
- కోలాహలంగా ఉట్టి కొట్టు కార్యక్రమం

డోన్ : హైందవ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పలు ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు, ముఖ్యంగా యాదవ్ కులస్తులు జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరు పుకున్నారు. పలువురు చిన్నారులకు శ్రీకృష్ణుడు,గోపికలు, గొల్ల భామల వేషధారణలు వేయించి వేడుక జరుపుకున్నారు. పలు పాఠశాలల్లో మహాభార తంలోని పలు అంకాలను దృశ్యరూపకాలుగా విద్యార్థులు ప్రదర్శించారు. పాతపేట సరస్వతి శిశుమందిర్ పాఠశాలలోశ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు అంగరంగ వైభవంగా జరిపారు. వివిధ వేషధారణలలో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు.

డోన్ టౌన్ : శ్రీకృష్ణుని జయంతిని శనివారం భక్తులు, యాదవ సంఘం నాయకులు, త్రైత సిద్ధాంతం భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి గోపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ చంద్రపల్లె నాగేశ్వరరావు యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రభుత్వ ఐటీఐ నుంచి ప్రధాన రహదారి వెంట పాతబస్టాండ్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క భజనలు, కోలాటాలు, యాదవ సంఘ మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బద్దల వెంకటేష్, ఓబులాపురం మదన్, సుధాకర్, రమణ, వెంకటేష్, మామిళ్లపల్లె తదితరులు పాల్గొన్నారు.

- త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ లోని ఫ్లైవర్ బ్రిడ్జి కింద మండపం ఏర్పాటు చేసి శ్రీకృషుణని విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో చిన్నారుల చేత శ్రీకృష్ణుడు, సత్యభామ, గోపిక వేషధారణ వేయించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వేడుకలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు రోడ్డులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల జెడ్పీటీసీ వెంకటలక్ష్మమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆరు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు జరిపి ఈ నెల 21వ తేదీన పట్టణంలో శ్రీకృష్ణుడి విగ్రహంతో గ్రామోత్సవం కొనసాగుతుందని ఇందూ జ్ఞానవేదిక మండల అధ్యక్షుడు జనార్ధన్ తెలిపారు. అలాగే మండలంలోని గుళ్లదూర్తిలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, సౌదరదిన్నె గ్రామాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపిక వేషధారణలో అలరించారు. ఆయా గ్రామాల్లో పండుగను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు.

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, రెడ్డిపల్లె, పేరుసోముల గ్రామాలలో శ్రీకృషాష్టమిని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆకుమల్ల చెన్నకేశవ దేవాలయంలో ఈఓ బాల చెన్నయ్య, పూజారి సత్యమయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో గ్రామస్తులుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నకేశవ ఆలయ ధర్మాకర్త మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, చౌదరి, చాకలి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని మార్కెట్ వీధిలోనీ కృష్ణాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహకులు పలు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పట్టణంలో ఆచార్య ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యం లో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నందవరం, యనకండ్ల, పలుకూరు గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి అభిషేకం అర్చన తదితర పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.


బేతంచెర్ల గోపాల కృష్ణ బృందావనంలో ఉట్టికొడుతున్న బాలకృష్ణుడు

బృందావనంలో అంబరాన్నంటిన సంబరాలు..

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన వెలసిన బృందావనంలో కృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం ఆయా కాలనీల నుంచి మహిళలు పెద్దఎత్తున్న తరలి వచ్చి శ్రీ కృష్ణుడికి పూజలు నిర్వహించారు. చిన్నారుల శ్రీ కృష్ణ, గోపికల వేషధారణ పోటీలు అలరించాయి. ఇందులో న్యాయనిర్ణేతల మార్కులు ఆధారంగా, ప్రతిభ చాటిన ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న చిన్నారులకు ఆలయ కమిటీ సభ్యులు నగదు, మిగతా 60 మందికి పోత్సాహక బహుమతులను దాతలు అందజేశారు. అనంతరం భక్తజన సందోహం మధ్యం యువకులు కోలాహలంగా రంగులు చల్లుకుంటూ ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహించారు. రేపల్లె గ్రామంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య భజన చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ స్కూలు కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా జగన్, నిర్వాహకులు వెంకట్, పద్మానాభం, వీరారెడ్డి, గూని నాగరాజు, రామ చంద్రుడు, మద్దిలేటి పాల్గొన్నారు.


చిన్ని కృష్ణ, గోపిక వేషధారణలో బేతంచెర్ల సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


నాయినపల్లెలో పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణ భగవానుడు అవతరించిన రోజున శనివారం సంబరంగా జరుపుకున్నారు. నాయినపల్లెలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నెల్లూరుకు చెందిన కోలాట ప్రదర్శన కళాకారుల మధ్య గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో తెల్లవారు జాము నుంచే పూజలు చేశారు. భక్తులు గీతాపారాయణం చేశారు. దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కొలిమిగుండ్ల, మీర్జాపురం,బందార్లపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమలు కొలువు దీర్చి విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బెలుంలోని శ్రీకృష్ణ మందిరంలో విశేష పూజలు జరిగాయి. విద్యార్థుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.


అవుకులో పూజలు చేస్తున్న త్రైత సిద్ధాంత భక్తులు

పెద్దరాజు స్వామి ఉరుసుకు ఆహ్వానం

బేతంచెర్ల : మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పెద్ద రాజు స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 20, 21, 22 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ శనివారం ఆహ్వాన పత్రిక అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అలాగే ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ మాజీ డైరక్టర్ ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, దస్తగిరి, పట్టణ, మండల కన్వీనర్లు పిట్టల జాకీర్, తిరుమలేశ్వర్ రెడ్డిలను ఆహ్వానించారు.

శుభకార్యం: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన కేశాలు నాయుడు, సువర్ణ దంపతుల కుమార్తె అర్చన వివాహ ముహుర్తానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గోరుమాను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు వధువుకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మయ్య, తిరుమలేష్, శ్రీనివాసులు, చిన్న గోరంట్ల, బాల స్వామి, అంబాపురం మద్దయ్య, రామ చంద్రుడు పాల్గొన్నారు.


మాజీ మంత్రి బుగ్గనకు గూటుపల్లె ఉరుసు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దర్గా పీఠాధిపతి

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు

బేతంచెర్ల : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటాలకు సిద్ధంగా ఉంటుందని నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల ఆవరణలో సీపీఐ జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమాన్ని మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలు పట్టణంలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను దృష్టిలో ఉంచుకొని ఈ జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేవా దళ్ కార్యకర్తలు ప్రజల సమస్యల పక్షాన పోరాడటమేకాకుండా, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు బాబా ఫకృద్దీన్, మోటా రాముడు, రాధాకృష్ణ, రమేష్ బాబు, నాగరాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు ఉదయ్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆ శాఖ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం మద్యం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. సంజామల మండలం ముక్కమల్ల, ముదిగేడు, దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండటంతో స్క్వాడ్ సీఐ లక్ష్మణరాజు, ఎస్‌ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఆయా గ్రామాలకు చెందిన శ్రీరాం, పుల్లయ్య, సురేష్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 49 మద్యం బాటిళ్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రేతలు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను కోవెలకుంట్ల ఎక్సైజ్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడుల్లో ఆ శాఖ హెడ్ కానిస్టేబుల్ రూఫ్‌సింగ్, కానిస్టేబుళ్లు ఓబులేసు, నాగరాజు, పాములేటి పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, బైక్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వాజ్‌పేయికి నివాళి

డోన్ టౌన్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి పురస్కరించుకొని శనివారం బీజేపీ శ్రేణులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉషాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, ఐటీ కన్వీనర్ వీరేష్ హాజరయ్యారు. అలాగే బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్‌కె నాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ మండల, అధ్యక్షులు బద్రీ సుధాకర్, బొంకూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతహేహానికి అంత్యక్రియలు

డోన్ : ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు అనాథ శవానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంపై నర్సాపురం – డోన్ ప్యాసింజర్ రైలు బోగీలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు సమాచారం అందజేయడంతో ఆత్మబంధువు సభ్యులు అక్కడికి చేరుకున్నారు. మృతుని అంత్యక్రియల కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి ఖర్చును భరించగా, ఆత్మబంధువు సభ్యులు గురుస్వామి, తాహెర్ బాషా, రైల్వే హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణమూర్తి తదితరులు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యం

జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

బనగానపల్లె : ఈ నెల 12న జరిగిన పులివెందుల ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం హత్య చేయబడినట్లు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు నిస్పక్షపాతంగా వ్యవరించాల్సిన పోలీంగ్ సిబ్బంది అందరూ అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలు బయటపడకుండా మీడియా ప్రతినిధులను ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లోకి అడుగుపెట్టనియలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన వీడియో, ఫొటోల సాక్షిగా జమ్మలమడుగు కమలాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేస్తూ పట్టుబడిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని ఆధారాలను, సాక్ష్యాలను బయటపెట్టిన ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు.

లోకేష్ పెట్టిన వీడియోలోనే దొంద ఓటర్లు..

పులివెందులలో ప్రజాస్వామ్యం వర్థిల్లిందంటూ మంత్రి లోకేష్ ట్వీట్ చేసిన వీడియోలోనే దొంగ ఓటర్లు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. పోలింగ్ బూత్‌లో పరిశీలన చేసినట్లుగా కలెక్టర్ విడుదల చేసిన బూత్‌లోనే దొంగ ఓటర్ల ఉన్నారన్నారు. పోలింగ్ బూత్‌ను అక్రమించుకున్న మంత్రి రాంప్రసాదరెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అత్యంతదారుణంగా అప్రజాస్వామికంగా నిర్వహించిన పులివెందుల ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలు పట్టించుకొని ప్రభుత్వం

నేడు రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా రైతులకు యూరియా ఎంతో అవసరం ఉండగా రైతులు పడరాని పాట్లు పడుతున్నా ప్రభుత్వం కళ్లు అప్పగించి చూస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. వచ్చిన యూరియా టీడీపీ వారే పంచుకుంటున్నారని ఆరోపించారు. రైతులందరిని సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, అవుకు, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు అత్తార్‌జాహెద్ హుస్సేన్, వైఎస్సార్ లీగల్ సెల్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, వలంటీర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి కునుకుంట్ల రామన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి సన్మానం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికైన బనగానపల్లె మండలం బత్తులూరుపాడు గ్రామానికి చెందిన అంబటి రవికుమార్‌రెడ్డి శనివారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మలను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వారికి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని అందజేయడంతో పాటు దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, కేక్ కట్‌చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం తెలిపారు. బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు లోపల ఉండి, 10 నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరును సంప్రదించాలన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

డోన్ : శ్రావణ శనివారా న్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి కలిసి రావ డంతో పలువురు వేకువ జామునే స్వామి వారి ని దర్శించి ప్రత్యేక పూ జలు చేపట్టారు. ఆల య అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా భక్తులకు ప్రసా ద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఎట్ హోమ్ ఆహ్వానితుడికి సత్కారం

డోన్ టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్ భవన్‌లో శుక్రవారం గవర్నర్ ఇచ్చిన విందుకు ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లిన డోన్‌కు చెందిన హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు దంపతులను ఘనంగా సన్మానించారు. శనివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు, న్యాయవాది నాగభూషణంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి ఆధ్వర్యంలో వారి ఇంటికి వెళ్లి సత్కరించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి, మారెళ్ల రాజశేఖర్ రెడ్డి, నరేష్, శ్రీను తదితరులు ఉన్నారు.


సురేష్‌బాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పని భారం తగ్గించాలి

బనగానపల్లె రూరల్ : ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలని ఏపీ ఆశా వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆశా వర్కర్ల యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధనకు ఆశా వర్కర్లు ఈ నెల 30, 31న కడపలో జరిగే రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్, ఆశా వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి వేదవతి తదితరులు పాల్గొన్నారు.

పూలు కాదు.. కొంగలు..!



కోవెలకుంట్ల మండలం ఎం. గోవిందిన్నె మెట్ట సమీపంలో ఉన్న తుమ్మ చెట్టుపై రాత్రి వేళల్లో కొంగలు సేద తీరుతున్నాయి. ఆహార అన్వేషణకు వెళ్లిన కొంగలు చీకటి పడగానే చెట్టు చిటారు కొమ్మలపై గుంపులుగా వాలడంతో తెల్లటిపూల వలే కన్పిస్తూ అటుగా వెళుతున్న ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. – కోవెలకుంట్ల